సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



వరదాయిని.. జగజ్జనని

'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. -10లో



తవ్వుకో.. దోచుకో..

తవ్వుకో.. దోచుకో' అన్న చందంగా కూటమి నాయకులు మట్టితో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇందుకోసం డీకేటీ భూములను ఎంచుకున్నారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
27.2/22.1

వాతావరణం

జిల్లాలో గురువారం 22.1 - 27.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

పోటెత్తిన అభిమానం



పులివెందుల క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజా దర్బార్‌కు విశేష స్పందన
- ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ తగ్గని రద్దీ
- అందర్నీ ఆప్యాయంగా పలకరించిన మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం జనాలతో కిటకిటలాడింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక జనాలే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైతం భారీగా తరలిరావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్యాంపు కార్యాలయం రద్దీగా ఉండిపోయింది. ఆపన్నహస్తం కోసం కొందరు, అభిమానం చూపేందుకు మరికొందరు, భరోసా కోసం ఇంకొందరు ఇలా... ఎవరికివారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ క్రమంలో తోపులాట సైతం తెరపైకి వచ్చింది. ఏ ఒక్కర్ని నిరుత్సాహపర్చకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆప్యాయంగా మాట్లాడారు. అండగా ఉంటానంటూ భరోసా కల్పించారు.



ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చిత్రంలో ఎంపీ అవినాష్

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందుల క్యాంపు కార్యాలయంలో 10గంటలు పాటు నిల్చునే ఉండిపోయారు. ఉదయం 9గంటలకు ఆయన ప్రజాదర్బార్ చేపట్టారు. అప్పటికే వేచి ఉన్న వందలాది ప్రజానీకానికి గంట గంటకు జనం తోడై వేల మంది క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం మొదలు రాత్రి 8గంటల వరకూ మధ్యలో ఒక గంటపాటు మధ్యాహ్న బోజనం సమయం మినహా పగలంతా ప్రజలతో మాట్లాడడంలోనే నిమగ్నమయ్యారు.

ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలు చేపట్టాలని పిలుపు...

ప్రజల్ని ప్రభుత్వం వంచింది. పైగా పన్నుల భారం మోపుతోంది. ఆర్థికంగా నడ్డి విరుస్తోంది. ఈ క్రమంలో ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలు కొనసాగించాలని తరలివచ్చిన కేడర్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. టీడీపీ దౌర్జన్యాలు భరించలేకున్నామని వాపోయిన కేడర్‌కు 'కష్టాలు ఎల్లకాలం ఉండవు, మంచి రోజులు రానున్నాయి, ఓపిక పట్టండి పార్టీ మీకు అండగా ఉంటుందని' భరోసా ఇచ్చారు. ఇలా కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు.

- కాగా ప్రజా సమస్యలను ఆలకించిన వైఎస్ జగన్ స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. పలు సమస్యల పరిష్కారానికి పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ దాసరి సుధా, ఎమ్మెల్సీలు డీసీ గోవింద రెడ్డి, రమేష్‌యాదవ్, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌బీ అంజద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి మేకా ప్రతాప్ అప్పారావు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, శింగనమల సాంబశివారెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





అభిమాన సంద్రం... ప్రజలు, పార్టీ శ్రేణులతో కిటకిటలాడిన క్యాంపు కార్యాలయం .... వినతిపత్రాలు స్వీకరిస్తున్న జననేత వైఎస్ జగన్

▸▸ అదిరిపోయిన ఆర్ట్



మీతో రక్తం పంచుకుని పుట్టకపోయినా...నీ కోసం రక్తం పంచిన బంధం మాది'అన్న క్యాప్షన్‌తో అభిమాని అజయ్‌రెడ్డి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫోటో ఫ్రేమ్ చూపెట్టి ఆటోగ్రాఫ్ కోరారు. చిరునవ్వుతో ఆటోగ్రాఫ్ ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన అజయ్‌రెడ్డి ముగ్ధుడయ్యాడు.



వైఎస్ జగన్‌కు 'బాసర' సరస్వతీ మాత చిత్రపటం బహూకరణ



మహిళ ఆవేదన వింటున్న వైఎస్ జగన్

▸▸ ఎల్లో మీడియా దుష్ప్రచారం

రద్దీ ఎక్కువై అభిమాన నాయకుడిని త్వరగా కలుసుకోవాలనే ఆరాటంతో కార్యకర్తలు మధ్య ఓ దశలో తోపులాట తెరపైకి వచ్చింది. అంతే.. 'ఆదిగోపులి అంటే ఇదిగో తోక'అంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని అందుకుంది. కార్యాలయంపై రాళ్ల దాడి అంటూ వండి వార్చడంలో నిమగ్నమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అభిమానులు ఎల్లోమీడియాపై విరుచకపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని ఇకనైనా మానాలంటూ హితవు పలికారు.

▸▸ నేడు వివాహానికి హాజరుకానున్న వైఎస్ జగన్

పులివెందుల రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం పులివెందుల పట్టణంలోని స్థానిక విజయ్ గార్డెన్‌లో జరిగే ఓ వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు. వైఎస్ జగన్‌తోపాటు ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు. అనంతరం అక్కడ నుంచి తాడేపల్లెకు బయలుదేరి వెళ్లనున్నారు.

న్యూస్‌రీల్

నేడు 36 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాలో 33 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

వైవీయూ పీజీ పరీక్షల షెడ్యూలులో మార్పు

వైవీయూ: యోగివేమన యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 2025 సంవత్సరం జనవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. డిసెంబరు నెల 30వ తేదీ నుంచి జరగాల్సి ఉన్నా విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మార్పు చేశామన్నారు. జనవరి 21, 23, 25, 27, 29, 31 తేదీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

29న జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని టీవీఆర్ హైస్కూల్ సమీపంలో ఈ నెల 29న ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ (దూరపుపరుగు) పోటీలను నిర్వహించనున్నట్లు బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి వై.ఆహ్మర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన వారిని జనవరి 5న పశ్చిమ గోదావరి తణుకులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 9949686586 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

5న జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్: ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు జనవరి 5వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో 35 ఏళ్ల పైబడిన క్రీడాకారులు మొదలు ప్రతి 5 సంవత్సరాలకు ఒక విభాగం చొప్పున 65 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9440107080, 9866028100 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని అట్లూరులో అత్యధికంగా 10 మి.మీ వర్షం నమోదైంది. అలాగే ఒంటిమిట్టలో 5.8, గోపవరంలో 5.2, వేములలో 5 , సీకేదిన్నెలో 4.4, సిద్దవటంలో 4.2, వేంపల్లిలో 4, చెన్నూరులో 3.8, పెండ్లిమర్రి, కడప, బి.కోడూరులో 3.2, ఖాజీపేట, బద్వేల్‌లలో 3, పులివెందుల, పోరుమామిళ్లలో 2.2, బి.మఠం, జమ్మలమడుగులో 2, ప్రొద్దుటూరులో 1.6, కాశినాయనలో 1.4, కలసపాడు, సింహాద్రిపురం, వల్లూరులో 1.2 , వీఎన్‌పల్లి, చాపాడులలో 1, రాజుపాలెంలో 0.8 మి.మీ వర్షం కురిసింది.

ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ పరీక్షల పరిశీలన

జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం: మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ మోదీన్‌సాబ్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జరుగుతున్న రాష్ట్రీయ బాలల సురక్షా స్క్రీనింగ్ (ఆర్‌బీఎస్‌కే) పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి నాగరాజు పరిశీలించారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు ప్రతి ఒక్కరికీ ముందస్తు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

ఏవైనా జన్యులోపాలు, శరీర భాగాలకు సంబంధించిన వ్యాధులు ఉంటే ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆశావర్కర్ల సాయంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా సర్వజన ఆసుపత్రులకు పంపించి వారి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం రిమ్స్‌లోని జిల్లా అత్యవసర సమాచార కేంద్రంలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని, అక్కడ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. నిర్దేశించిన వ్యవధిలో రోజుకు 30 మంది చొప్పున పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సూచించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, సూపర్‌వైజర్లు జ్యోతి, రమణయ్య, ఏఎన్‌ఎంలు యశోద, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



మోదీన్‌సాబ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పిల్లల స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యాధికారి నాగరాజు

నేడు ఉద్యోగమేళా

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జిల్లాలోని పీలేరు, రైల్వేకోడూరులలో ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు పట్టణంలోని ఎస్‌జీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో, రైల్వేకోడూరు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్‌లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పీలేరు-9966086996, రైల్వేకోడూరు-9550095775 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

• బాదుడే...బాదుడు!

కరెంటు బిల్లు.. జేబుకు చిల్లు

- ప్రజలకు 'షాక్' ఇస్తోన్న కూటమి సర్కారు
- ఈ నెల బిల్లు నుంచి రూ.15.1కోట్లు వసూలు
- రెండు నెలల్లోనే చంద్రబాబు సర్కార్ జిల్లా వాసులపై వేసిన భారం రూ.22.26కోట్లు
- ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ
- హామీకి విరుద్ధంగా ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం
- ప్రజాపక్షమై పోరుబాట పట్టిన వైఎస్సార్‌సీపీ



సాక్షి ప్రతినిధి, కడప: అసలే చలికాలం.. ఫ్యాను ఎక్కువగా తిరగాల్సిన అవసరం రాదు.. ఇక లైట్లు.. టీవీ.. రిఫ్రిజిరేటర్ మామూలే... అన్నీ గతంలో ఉన్న విద్యుత్ ఉపకరణాలే.. ప్రతి నెలా మాదిరే ఈ నెల కూడా 180 యూనిట్లకు ఒకట్రెండు అటోఇటో వినియోగించారు.. అయినా బిల్లేమో వెయ్యికి పైగానే వచ్చింది. ఎందుకో ఆరా తీస్తే .. బిల్లును తరచి చూస్తే ఇదంతా కూటమి సర్కారు 'సర్దు'పోటు బాదుడని తేలింది. విద్యుత్ చార్జీలపై లేనిపోని సర్దుబాటు చార్జీలు పెంచుతూ ప్రజలకు షాకిస్తోంది.

- జిల్లా వాసులపై కూటమి ప్రభుత్వం రెండోసారి భారీ విద్యుత్ చార్జీల భారం మోపింది. జిల్లాలో మొత్తం 8,89,907 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెలా రూ.15కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం వసూలు చేయడం ప్రారంభించింది. యూనిట్‌కు 61పైసలు చొప్పున అదనపు భారం మోపింది. 2022లో ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో ఈనెల నుంచి వసూలు చేయనుంది. ఒక్కో యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. ఇది ఎక్కువ మొత్తం అవుతుందని, బిల్లు భారీగా పెరగడంతోపాటు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉండటంతో దొడ్డిదారి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎఫ్‌పీపీసీఏ చార్జీలను రూ.1.21లు ఒకేసారి కాకుండా ఈనెల 61 పైసలు, మరో నెల 60పైసలు చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఈనెల బిల్లులో 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి యూనిట్‌కు 61పైసలు చొప్పున డిసెంబర్ బిల్లులో వినియోగదారులకు వడ్డించారు. ఇలా జిల్లా పరిధిలో ఈ నెల అదనంగా రూ.15.10కోట్లకు పైగా వసూలు చేస్తున్నారు. ఈ తర్వాత నెల 60పైసలు చొప్పున రూ.10కోట్లకు పైగా వసూలు చేయనున్నారు. మొత్తంగా జిల్లా ప్రజలపై రూ. 22.26కోట్ల భారం ప్రభుత్వం మోపింది. 2024 అక్టోబర్ నెల నుంచి వస్తున్న సర్దుబాటు చార్జీలకు ఇవి అదనం.

ప్రతినెలా విద్యుత్ ఘాతం...

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ) కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతినెలా వడ్డనకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2022 ఏప్రిల్ నెల సర్దుబాటు చార్జీలకు తోడుగా అక్టోబర్ నెల నుంచి ఏ నెలకు ఆనెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసలు చొప్పున భారం వేస్తున్నారు. ఇలా ప్రతినెలా సుమారు రూ.10 కోట్లను వసూలు చేయనున్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలా గత రెండు నెలల్లో జిల్లా వాసులపై రూ.22.26కోట్ల భారం వేశారు. నవంబర్ ట్రూఅప్ చార్జీలు రూ.2.37కోట్లు, ఎఫ్‌పీపీసీఏ చార్జీలు రూ.4.79కోట్లు, డిసెంబర్ మాసంలో ట్రూఅప్ చార్జీలు రూ.2.34కోట్లు, ఎఫ్‌పీపీసీఏ చార్జీలు రూ.15.10కోట్లు వడ్డించారు.


▸▸ వడ్డింపు ఇలా....

కడప నగరం మారుతీనగర్‌కు చెందిన సి. శ్రీనాథ్ గత నవంబర్ నెలలో ఫ్యామిలీతో కలిసి వేరే ఊరు వెళ్లారు. నెలంతా లైట్లు, ఫ్యాన్లు ఏమీ వేయలేదు. దీంతో కేవలం 2 యూనిట్ల విద్యుత్ వాడకం జరిగింది. అయితే బిల్లు మాత్రం రూ.454 వచ్చింది. ఇందులో ఎనర్జీ చార్జెస్ రూ.3.80లు అయితే ఫిక్స్‌డ్ చార్జీలు రూ.60, కస్టమర్ చార్జీలు రూ.25, ఎఫ్‌పీపీసీఏ 2022-04 చార్జీలు రూ.364లు కలిపి రూ.454లు వేశారు. ఇందులో వాడిన యూనిట్లకు రూ.3.80 పోగా మిగిలిన చార్జీలన్నీ రూ.450.2లు ప్రభుత్వం అదనంగా మోపిన భారంగా చెప్పవచ్చు.

▸▸ నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

ప్రజలపై భారం మోపుతోన్న చంద్రబాబు సర్కార్ చర్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రమైన కడపలో నేడు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమైంది. జిల్లా కేంద్రమైన కడపలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వద్దగల విద్యుత్ భవన్ వద్దకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టనున్నారు. కమలాపురంలో ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి, బద్వేలులో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నేతృత్వంలో ఆందోళన నిర్వహించనున్నారు. మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ పోరు కొనసాగనుంది. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డిల ఆధ్వర్యంలో విద్యుత్ పోరు కొనసాగనుంది. పులివెందులలో పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ పోరు కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పోస్టర్ల ఆవిష్కరణ చేశారు.


వినియోగం తగ్గినా..



అక్టోబర్ నెలలో 113 యూనిట్లకు రూ.499 బిల్లు వచ్చింది. నవంబర్ నెలలో 93 యూనిట్లకే రూ.478 బిల్లు వచ్చింది. కరెంట్ వినియోగం తగ్గినప్పటికీ బిల్లు మాత్రం పెరిగింది. ఈ చలికాలంలోనే ఇలా బిల్లులు వస్తుంటే... ఇక వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరిగి కరెంటు బిల్లు ఇంకా ఎంత పెరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

- నాగేశ్వరి, కానపల్లె, ప్రొద్దుటూరు మండలం


ఎలా కట్టాలి..



గత నెల వరకూ మా ఇంటికి రూ.350-450లు వరకూ కరెంట్ బిల్లు వచ్చేది. ఈ నెల రూ.650లు బిల్లు వచ్చింది. ఒక్క నెలలోనే ఇంత కరెంట్ బిల్లు పెరిగితే ఎలా కట్టాలి. ఈ ప్రభుత్వంలో ఎలాంటి కరెంట్ బిల్లులు పెంచమని చెప్పిన పాలకులు ఇప్పుడు కరెంట్ బిల్లులు పెంచటం ఏ మాత్రం బాలేదు. ఇప్పటికైనా పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించాలి.

-ఎస్‌కే ఉసేన్ బీబీ, గృహిణి, దువ్వూరు

బిల్లుల పెంపు దారుణం



ప్రజాభిప్రాయం తీసుకోకుండానే విద్యుత్ చార్జీల పెంపునకు ఎనర్జీ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం దారుణం. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక 6 నెలల కాలంలో రెండు సార్లు పెద్ద మొత్తంలో విద్యుత్ భారం మోపడం సరైంది కాదు.

-వి.వీరశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

ఏపీఈఆర్‌సీ ఆమోదం మేరకే...

సర్దుబాటు తప్పదు. నిబంధనల మేరకే సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నాం. బిల్లులో వాటిని జత చేశాం. ఏపీఈఆర్సీ ఆమోదం తర్వాతే ఈ నిర్ణయం జరిగింది. ట్రూ అప్ చార్జీలు త్వరలోనే ముగుస్తాయి.

- ఎస్ఈ, రమణ, పర్యవేక్షక ఇంజినీరు, ఆపరేషన్

క్లుప్తంగా

పెట్రోలు బంకు సిబ్బందిపై దాడి

అట్లూరు : పెట్రోలు బంకు సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అట్లూరు క్రాస్ రోడ్డుకు చెందిన దేవర బాలకృష్ణతోపాటు మరో ముగ్గురు రెడ్డిపల్లి దగ్గర ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు వెళ్లి బాటిళ్లకు పెట్రోలు అప్పుగా పట్టాలన్నారు. బంకులో పని చేసే సిబ్బంది అప్పుగా పట్టేది లేదనడంతో ఆగ్రహించి దాడి చేశారు. దీంతో పెట్రోలు బంకులో పని చేస్తున్న గంపా రత్నమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ చేసి దేవర బాలకృష్ణతోపాటు మరో ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణ శివారులోని దువ్వూరు రోడ్డులో ఓ వ్యక్తి నుంచి ఢిల్లీ రాష్ట్రానికి చెందిన 12 మద్యం ఫుల్ బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దువ్వూరు రోడ్డులో మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో.. ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి గురువారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పట్టణంలోని అరవిందాశ్రమం వీధికి చెందిన పట్నం సుధాకర్‌ని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి ఢిల్లీ రాష్ట్రానికి చెందిన 12 రెడ్ లేబుల్ మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సీఐ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అట్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును సీజ్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తీసుకొస్తుండగా అట్లూరు క్రాస్ రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద గురువారం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి, జరిమానా నిమిత్తం తహసీల్దారుకు అప్పగించినట్లు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని నాగలకట్ట వీధికి చెందిన దూదేకుల మనోహర్ (41) గురువారం రాత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగలకట్ట వీధికి చెందిన దూదేకుల మనోహర్ భార్య మాబున్నీ.. భర్తను వదలి వెళ్లడంతో మానసికంగా కుంగిపోయి వీధుల వెంట తిరిగే వాడు. చిత్తు కాగితలు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యానికి బానిసై తాగేవాడు. గురువారం రాత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో బైపాస్ సమీపంలో చనిపోయి ఉన్నాడు. కాగా ఇతని శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. మనోహర్ సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడప చరిత్ర ఎంతో గొప్పది

వైవీయూ : కడప జిల్లా చరిత్ర ఎంతో గొప్పదని యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన యువత యూత్ ఎక్చేంజ్ కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా చరిత్ర, విశిష్టతను తెలుసుకొనేందుకు ఇక్కడికి రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ పాల్గొన్నారు.

తవ్వుకో.. దోచుకో..


డీకేటీ భూమిలో మట్టిని తవ్వుతున్న జేసీబీ


ఏర్పడిన పెద్ద గుంత

- పేట్రేగుతున్న కూటమి నాయకుల అక్రమాలు
- డీకేటీ భూముల మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'తవ్వుకో.. దోచుకో' అన్న చందంగా కూటమి నాయకులు మట్టితో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇందుకోసం డీకేటీ భూములను ఎంచుకున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతూ.. మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరలించేస్తున్నారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని మాలెపాడు ఫ్యాక్షన్ గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఉంది. ఈ గ్రామంలో ఇప్పటికీ పికెటింగ్ కొనసాగుతోంది. ఎలాంటి చిన్నపాటి సంఘటనలు కూడా జరగకుండా ఉండేందు పోలీసుల నిఘా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత.. ఇక్కడ దందా సాగుతోంది. కూటమి నాయకులు దీన్ని ఆదాయ వనరుగా ఎంచుకున్నారు.

అనుమతులు లేకున్నా..

ఎలాంటి అనుమతులు లేకున్నా.. డీకేటీ భూముల్లో జేసీబీల ద్వారా మట్టిని తవ్వేస్తున్నారు. టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రధాన పట్టణమైన ప్రొద్దుటూరుకు అధికంగా తీసుకున్నారు. ఒక్కొక్క టిప్పర్ మట్టిని రూ.3 వేలకు అమ్ముకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక శాఖ అధికారులు మరో శాఖ వారిపై నెపం నెట్టివేస్తూ తప్పించుకుంటున్నారు. సమన్వయంతో పని చేసి కట్టిడి చేయాల్సి ఉండగా.. చోద్యం చూడటం గమనార్హం. దీంతో డీకేటీ భూముల్లో పెద్ద గుంతలు పడుతున్నాయి. భారీ వాహనాలు నిరంతరం వెళ్లడం ద్వారా రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దందాను నియంత్రించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం తగదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం సాయంత్రం కడపలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న ఛరిష్మా దేశంలో ఎవరికీ లేదన్నారు. స్వయంకృషితో పార్టీని స్థాపించి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆయన జిల్లాకు వచ్చారని, వైఎస్ జగన్‌ను చూసేందుకు రోజూ తెల్లవారుజాము నుంచే నివాసం వద్దకు జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారన్నారు. వేలాది మంది తండోపతండాలుగా రావడంతో అదుపు చేయడం అసాధ్యంగా మారిందన్నారు. దీన్ని కూడా రాజకీయం చేసి జగన్ ఇంటిపై రాళ్లదాడి అని ప్రసారం చేయడం దారుణమన్నారు. ఇలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం ఎల్లో మీడియాకు తగదన్నారు. రాష్ట్రంలో దరిద్రమైన పాలన కొనసాగుతోందని, ప్రజలకు ఇసుమంత మంచి కూడా జరగడం లేదన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదన్నారు. దీనిపై మాత్రం ఎల్లో మీడియా ఎలాంటి కథనాలు ప్రసారం చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్‌కుమార్, వెంకటేశ్వర్లు, సీహెచ్ వినోద్ కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.

మానవ ప్రమేయం లేకుండానే డ్రైవింగ్ లైసెన్స్‌లు


ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న డీటీసీ, ఆర్టీఓ, ఎంవీఐలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఇకపై మానవ ప్రమేయం లేకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ఉంటుందని కడప డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో రూ.1.36 కోట్లతో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆర్టీఓ మురళీధర్, ఎంవీఐలతో కలిసి ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం డీటీసీ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అత్యాధునిక ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు, అనంతపురంలో మాత్రమే ఆటోమేటిక్ ట్రాక్‌లు ఉన్నాయని తెలిపారు. సెకండ్ ఫేజ్ కింద ప్రొద్దుటూరులో ప్రారంభించామన్నారు. త్వరలో వైజాగ్, నెల్లూరు, తిరుపతిలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో సాధారణ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లు కూడా లేవని, క్రమేణా ఆర్టీఓ కార్యాలయాల్లో వాటిని ఏర్పాటు చేస్తూ వచ్చారన్నారు. ట్రాక్‌లు ఉన్ననూ డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేసే విషయంలో కావాల్సిన వారికి ఇస్తున్నారని, రవాణాశాఖ అధికారులపై కొన్ని అభియోగాలు వచ్చేవని చెప్పారు. తగినంత మేర స్థలం లేనందున హెవీ డ్రైవింగ్ టెస్టింగ్ విషయంలో ఆటోమేటిక్ విధానం ఉండదన్నారు. అవగాహన కోసం ఇక్కడికి వచ్చే వాహనదారులకు 10–20 నిమిషాల పాటు డెమో ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్, ఏఓ కరిముల్లా, ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్ర నాయక్, హేమకుమార్, ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

– డీఐజీ కోయ ప్రవీణ్

కడప అర్బన్ : సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా వుండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు రేంజ్‌లోని (కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య) ప్రజలకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ బ్యాంకు వారు కూడా ఓటీపీలు అడగరని ఆయన పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు ఎవరు అడిగినా కూడా చెప్పకూడదన్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి ఏమీ లేవన్నారు. అవన్నీ సైబర్ నేరగాళ్ల చేసే మోసాలన్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో డబ్బులు రెట్టింపు అవుతాయనే సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోకూడదన్నారు. సులభంగా లోన్ పొందవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపుతారన్నారు. ఫోన్‌లు చేస్తారన్నారు. బ్యాక్ గ్రౌండ్ వెరిఫికేషన్ లేకుండా, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోన్ ఇస్తామంటే అనుమానించాలన్నారు. మీకు తక్కువ మొత్తం లోన్ ఇచ్చి భారీ మొత్తం తిరిగి చెల్లించమంటారని, లేకపోతే మీ గ్యాలరీలోని ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి, మీ ఫోన్‌లోని బంధువులకు, స్నేహితులకు పంపుతామని బెదిరిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే బాధిత ప్రజలు వెంటనే డయల్ 1930కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ సైబర్‌క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఐఎన్ ఫిర్యాదు చేయాలన్నారు.

నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో నిర్వహించిన 35 ఏళ్ల విజయోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట, ఏపీ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇక్బాల్, ప్రధాన కార్యదర్శిగా ముష్తాఖ్, గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ మునాఫ్, ఆర్థిక కార్యదర్శిగా అసదులాబాషా, మహిళ కార్యదర్శిగా షేక్ జబీన, అసోసియేషన్ అధ్యక్షులుగా షాహిదుల్లా, సత్తార్‌ఫైజీ, అబ్దుల్ రఖీబ్, నఖి పుల్ల, హమీద్, మహమ్మద్ గయాస్, రఫీ, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అలీ, వజీహుజ్జమా, మోయిన్‌బాషా, మహమ్మద్‌ఖాన్, అఫ్జల్‌బాషా, షాజహాన్, కలీం, అదనపు ప్రధాన కార్యదర్శులుగా అయ్యూబ్, ముజీబ్‌షాహీ, ఫైరోజ్ అహ్మద్, నిసార్ అహ్మద్, రబ్బానీ, జిలానీబాష, హుస్సేన్, కార్యదర్శులుగా హుస్సేన్, సాధిక్‌అలీ, ముష్తాఖ్ అహ్మద్, ముష్తాఖ్, ఆరీఫుద్దీన్, కాలేషా, సహాయ ఆర్థిక కార్యదర్శులుగా నియా జీఖాన్, దస్తగిరి, జావేద్, అన్సర్, అతావుల్ల, కన్వీనర్లుగా పకృద్దీన్, జాని, తయ్యబ్, రఖీబుర్ రాజీఖ్, న్యాముతుల్లా, బాజాని, కౌసర్‌బేగం, రహ్మద్, జాకీర్‌ఖాన్, రఫీ, హుస్సేన్ ఎన్నికయ్యారు.

రాష్ట్రం అంతటా జగనన్నకు ఇదే ప్రజాదరణ

- **మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి**



పులివెందుల రూరల్ : కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇదే ప్రజాదరణ లభిస్తోందని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సింగనమల వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివారెడ్డి అన్నారు. గురువారం పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు «సాక్షి»తో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో అసత్యపు ఆరోపణలు, అబద్ధాలు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. లింగాల మండలంలో ఒక గ్రామానికి రామాలయం ప్రారంభోత్సవానికి వెళ్లి రావడానికి 30 కిలోమీటర్ల దూరానికి 9 గంటల సమయం పట్టిందంటే ఇంత ప్రజాదరణ గల నాయకుడు ఎవరో తెలుసుకోవాలన్నారు. దారి పొడవునా ఉన్న ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అంత ప్రజాదరణ కలిగిన నాయకుడిపై ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని కూటమి ప్రభుత్వం అసత్యపు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసే వారందరూ ప్రభుత్వంలో బాధపడుతున్న వారు, అక్రమ కేసులు పెడుతున్నారని జగన్‌కు చెప్పేందుకు వచ్చిన వారేనన్నారు. కూటమి ప్రభుత్వం 90 శాతం మంది ప్రజల పింఛన్లను తొలగించిందని, ఆరోగ్యశ్రీ వర్తించలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని.. సహాయం అందించాలని మాజీ సీఎం వైఎస్ జగన్ వద్దకు రావడం జరిగిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు రోడ్డు మీదకు వచ్చారని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి వేరే విధంగా ప్రచారం చేయడం సరికాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఎల్లో మీడియా ద్వారా ఏదో రకంగా ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నమ్ముతారని, అదే ధోరణిలో చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల వ్యవధిలోనే వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నాయన్నారు.

చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



పులివెందుల రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఉన్న ఓపిక తాను ఎవరిలో చూడలేదని, కూటమి ప్రభుత్వం ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని చౌకబారు రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వైఎస్ జగన్ మూడు రోజుల పర్యటనలో విపరీతమైన జనం వచ్చారని, సెల్ఫీల కోసం యువకులు, ప్రజలు ఎగబడ్డారన్నారు. పులివెందుల నుంచి తాతిరెడ్డిపల్లెకు 25 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉందని, దారి పొడవునా జన నీరాజనంతో తాతిరెడ్డిపల్లెకు చేరుకోవడానికి 7 గంటల సమయం పట్టిందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ దారి పొడవునా వేలాది మంది ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారన్నారు. జన సందోహం మధ్య కార్యకర్తలను చెదరగొట్టే సమయంలో.. ఒక్క సారిగా కార్యకర్తలు అద్దాలపై పడటంతో అద్దాలు విరిగాయన్నారు. ఈ చిన్న విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి అంటూ ఏబీఎన్, టీవీ5లో స్క్రోలింగ్‌లు రావడం విడ్డూరంగా ఉందన్నారు. అసత్యపు ఆరోపణలు, ప్రచారాలు చేయడానికి సిగ్గు ఉండాలన్నారు. దమ్ముంటే ఏబీఎన్ రిపోర్టర్‌ను తనతోపాటు పులివెందుల పార్టీ కార్యాలయానికి పంపించాలన్నారు. రాత్రి 7 గంటల సమయంలో కూడా జగన్‌ను కలిసేందుకు పార్టీ కార్యాలయం వద్ద వేలాది మంది కార్యకర్తలు వేచి ఉన్నారన్నారు. ఒక ఫొటో, ఓ పలకరింపు కోసం ప్రజలు బారులు తీరారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉదయం నుంచి ఇప్పటి వరకు తనను కలవడానికి వచ్చిన వారి కోసం పార్టీ కార్యాలయంలోనే అందుబాటులో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఎల్లో మీడియా చౌక బారు రాజకీయాలు మానుకోవాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంతలోకాలకు..


తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న రామకృష్ణారెడ్డి

అట్లూరు : ఆస్పత్రికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ మహిళ మృత్యువాత పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కమలకూరు గ్రామానికి చెందిన సోదినపల్లి రామలక్షుమ్మ(50), సుబ్బారెడ్డి దంపతులు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి రామకృష్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి అనే కుమారులు ఉన్నారు. రామకృష్ణారెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నాడు. చిన్న కుమారుడు హరికృష్ణారెడ్డి హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీర్‌గా ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. కష్టపడి పని చేసుకుంటూ.. ఇద్దరు కుమారులను ప్రయోజకులను చేశారు ఆ దంపతులు. రామలక్షుమ్మ తనకు ఆరోగ్యం బాగ లేదని పెద్దకుమారుడు రామకృష్ణారెడ్డికి ఫోన్ చేయడంతో.. ఆయన బెంగళూరు నుంచి వచ్చాడు. తన తల్లిని తీసుకుని ఆస్పత్రి నిమిత్తం గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై కడపకు బయలుదేరారు. సిద్దవటం మండలం శనేశ్వరస్వామి గుడి దగ్గరికి వెళ్లే సరికి.. వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతోపాటు రామలక్షుమ్మపై దూసుకు పోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, రామకృష్ణారెడ్డి గాయాల పాలయ్యాడు. కళ్లెదుటే తల్లి మృతి చెందడంతో రామకృష్ణారెడ్డి కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని స్థానికులు 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన రామకృష్ణారెడ్డి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దేశాలు దాటిన ప్రేమ

ప్రొద్దుటూరు అబ్బాయికి, పోలాండ్ అమ్మాయికి వివాహం


వివాహం చేసుకున్న అక్షర, శ్రీహర్ష

ప్రొద్దుటూరు : ప్రేమకు కులమతాలతోపాటు దేశ సరిహద్దులు కూడా అడ్డు రావని వారు నిరూపించారు. ప్రొద్దుటూరుకు చెందిన అరకటవేముల లక్ష్మీనారాయణ, సుశీల కుమారుడు శ్రీహర్ష.. పోలాండ్ దేశానికి చెందిన జన్ పొలుస్, బొగ్గుమిళ వ్రోబెల్ కుమార్తె అక్షరను సంప్రదాయబద్ధంగా గురువారం వివాహం చేసుకున్నారు. ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటి రిసార్ట్స్‌లో ఈ వివాహం జరిగింది. పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. శ్రీహర్ష ఎంఎస్ చదివేందుకు స్వీడన్ వెళ్లాడు. పోలాండ్‌కు చెందిన అర్చన అదే కళాశాలలో చదువుతుండేది. చదువు పూర్తి చేసుకున్న ఇరువురు అక్కడే సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. కళాశాలలో చదువుకున్న రోజుల నుంచి ప్రేమించుకున్న వీరు కుటుంబ పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. పోలాండ్ దేశానికి చెందిన పలువురు వివాహానికి హాజరయ్యారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన నీలకంఠారెడ్డి

సింహాద్రిపురం : కారు ఢీకొన్న ప్రమాదంలో గురువారం ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కసనూరు గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డి(55) పశువుల గడ్డి కోసం బైక్‌పై అంకాలమ్మ గూడూరు – అగ్రహారం గ్రామాల మధ్యలో ఉన్న పీబీసీ కాలువ సమీపంలో వెళ్తున్నాడు. అతన్ని సింహాద్రిపురం నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీలకంఠారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో భారీ సంఖ్యలో జనాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2024 డిసెంబర్ 26 నాటికి 100 ఏళ్లు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతున్నదన్నారు. నాటి నుంచి నేటి వరకూ దేశ సమైక్యత, సమగ్రత కోసం పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎస్.విజయలక్ష్మి, నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, జి.మద్దిలేటి, ఏఐవైఎఫ్ గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు శంకర్ నాయక్, సావంత్ సుధాకర్, టి.మనోహర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మునయ్య, ప్రకాశం, భాగ్యలక్ష్మి, లింగన్న, ఏఐఎస్ఎఫ్ శివశంకర్, తేజ, అరుణ్, రామ్మోహన్‌రెడ్డి, బ్రహ్మం, యేసు రత్నం, ఆర్.బాబు తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

వరదాయిని.. జగజ్జనని


పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి


గీతా పారాయణం ఆలపిస్తున్న చిన్మయామిషన్ వారు

- కనుల పండువగా అమ్మవారి ఆరాధనోత్సవాలు
- మార్మోగిన ఈశ్వరీదేవి నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. 'కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు' అంటూ భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఈశ్వరీదేవి మఠం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మంగారి మఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన గురువారం పూర్వపు మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య సాముల వారి ఆరాధన నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, అభిషేకం, బిల్వదళార్చన, గురుపూజ విధులు చేపట్టారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ద్వార పూజ, నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. బ్రహ్మంగారిమఠానికి చెందిన శ్రీచిన్మయామిషన్ వారి గీతాపారాయణం భక్తులను అలరించింది. కళాకారులు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, బి.నారాయణస్వామి, సి.రామిరెడ్డి, ఎమ్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళ

బ్రహ్మంగారిమఠంలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. అమ్మవారి ఆరాధనోత్సవాలకు వచ్చిన వారు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను దర్శించుకుంటున్నారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివాస గృహం, పోలేరమ్మ చేత నిప్పు తెప్పించిన రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్య మఠం, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, సిద్ధయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం(విభూది లింగం), మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, రామాలయం (భజన మందిరం) తదితర ప్రాంతాలను సందర్శించారు.